www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 2 ఏప్రిల్ 2025

5

వైఎస్ఆర్

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం సాంఘీక శాస్త్రంతో పరీక్షలు పూర్తయాయి. జిల్లా యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావు లేకుండా పరీక్షలను విద్యాశాఖాధికారులు పకడ్బందీగా నిర్వహించారు. జిల్లాలో 161 సెంటర్లలో రెగ్యులర్ విద్యార్థులు 27,768 మంది హాజరు కావాల్సి ఉండగా 27,624 మంది హాజరయ్యారు. 144 మంది గైర్హాజరయ్యారు. ప్రయివేట్ విద్యార్థులు 22 మందికి గాను 19 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. 84 సెంటర్లకు సిట్టింగ్ స్వాడ్స్‌ను కేటాయించారు. ఏడుగురు మంది ఫ్లైయింగ్ స్వాడ్స్ బృందాలు 50 సెంటర్లను జిల్లా నోడల్ అధికారి బి.మధుసూధనరావు 4 సెంటర్లు, డిఇఒ డాక్టర్ షంషుద్దీన్ 5 సెంటర్లు పరిశీలించారు.

పేదలపై పి-4 పిడుగు

- 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాల నమోదు
- సంక్షేమ పథకాలు తొలగిస్తారేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన
- సచివాలయ ఉద్యోగులపై పనిభారం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ 'మీ ఇంటికి ఇన్ని పథకాలు వస్తాయి. ఇంత మేలు జరుగుతుందంటూ' నమ్మించారు. అధికారంలోకి వస్తే మీ జీవితాలు బాగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా వీటి అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొకుతున్నారు. తాజాగా పి-4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు శ్రీకారం చుట్టారు. ఫోన్, టీవీ, ఏసీ, కారు, ఫ్రిడ్జ్ ఇతర గృహోపకరణాలు, ఇల్లు స్వరూపం, రేకులా, స్లాబా, బ్యాంక్ అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నల్ని సంధించి సమాధానాలను సేకరించి సంబంధిత వివరాలను సచివాలయ సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోనుకు వచ్చిన ఒటిపిని నమోదు చేసి ప్రక్రియను ముగిస్తున్నారు. జిల్లాలో 4 రెవెన్యూ డివిజన్లు, 36 మండలాలు, 557 గ్రామ పంచాయతీలు, 726 రెవెన్యూ గ్రామాలు, 2,257 ఆవాసాలలో జిల్లా జనాభా 20,60,654, అందులో గ్రామీణ జనాభా 12,51,364, పట్టణ జనాభా 8,09,290. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల జనాభా 3,37,860, షెడ్యూల్డ్ తెగల జనాభా 40,994 మంది ఉన్నారు. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువున కుటుంబాల్లో అప్పోసప్పో చేసి నెలవారీ వాయిదాల్లో లేక ఎవరైనా కానుకగా ఇస్తే వారి ఇళ్లల్లో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుంటారు. ఏసీ ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి నమోదు చేస్తున్నారు. దీంతో తమకు సంక్షేమపథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది. వివిధ గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే చడీచప్పుడూ లేకుండా జరుగుతోంది. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి రోజుకు తమ పరిధిలోని 200 కుటుంబాల్లో సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వారిలో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్‌హోల్డ్, జియో టాకింగ్, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, 6 ఏళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వసూళ్లతో పాటు ఆయా సర్వేలపై ఐవిఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండటంతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు.

నిరాకరించినా.. నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్లు, బైక్లు ఇలాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది. పి-4 సర్వేను నిబంధనలను అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మున్సిపల్ కమి షనర్లు, ఎంపిడిఒలు కిందిస్థాయి అధికా రులకు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుక బడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహ దపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియ జేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో ఆయోమయం నెలకొంది.

సరైన సమాచారం కోసమే..

సరైన సమాచారం కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపిడిఒ కింది స్థాయి అధికారులకు చెపుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందని, ఈ అంశాన్ని ప్రజలకు తెలియపర్చాలని సిబ్బం దికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం లబ్దిదారుల్లో కొంత అయోమయం నెలకొంది. పై సర్వేలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనన్న ఆందోళన దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో నెలకొంది. గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే ఈ ప్రభుత్వం వ్యవహరించడంతో కొంత అసంతృప్తి ప్రజల్లో నెలకొంది. సామాన్య ప్రజలను సంక్షేమానికి దూరం చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పథకాలలో కోత విధిస్తారని ఆందోళనగా ఉంది

పి-4 సర్వే చేయడం వల్ల సంక్షేమ పథకాలలో కోత విధిస్తారని ఆందోళనగా ఉంది. మొబైల్, మోటార్ వెహికల్, ఫ్రిడ్జ్, ఫ్యాన్ తదితర వస్తువుల గురించి సర్వేకు వచ్చిన సిబ్బంది అడుగుతున్నారు. ఇవి లేకుండా జీవించే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఇవి ఉన్నాయని పథకాలు తొలగిస్తారని ఆందోళనగా ఉంది.

- భాగ్య, గృహిణి పులివెందుల.

సర్వే వల్ల రైతులకు నష్టాలు ఎక్కువ

సర్వే నిర్వహించడం వల్ల మధ్యతరగతి రైతులకు నష్టం తప్ప లాభం లేదు. మధ్యతరగతి రైతులు వ్యవసాయం కోసం మోటార్ వెహికల్, ట్రాక్టర్లు, మోటర్లు, పండించిన పంటను అమ్ముకున్న తర్వాత బ్యాంకు లావాదేవీలు వంటివి ఉంటాయి. సచివాలయ సిబ్బంది చేసే సర్వేలో ఇవి పొందుపరిస్తే ప్రభుత్వం నుంచి రాయితీలు రాకుండా పోయే పరిస్థితి ఉంది.

- జనార్దన్ రెడ్డి, రైతు పులివెందుల.

ప్రజల స్థితిగతులను తెలుసుకోవడం కోసమే

ప్రజల స్థితిగతులను తెలుసుకోవడం కోసమే పి-4 సర్వే ప్రభుత్వం చేపట్టింది. ప్రజా సమస్యలు కూడా తెలుసుకోవడానికి ఈ సర్వే వల్ల వీలవుతుంది. అపోహలకు గురికాకుండా అధికారులు అడిగిన దానికి సమాచారాన్ని ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం

-రామాంజనేయరెడ్డి, ఎంపిడిఒ, పులివెందుల.

సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

కదం తొక్కిన కార్మికులు

- ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులు డిమాండ్
- నగరంలో ర్యాలీ.. కార్పొరేషన్ ఎదుట ధర్నా

రాష్టంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకున్న ఆప్కాస్ విధాన రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని మున్సిపల్ కార్మికులు కదం తొక్కారు. ముఖ్యంగా కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర బెనిఫిట్స్ ఇవ్వాలని నినదించారు.

కడప కార్పొరేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరపాలక సంస్థ కార్మికులు కోటిరెడ్డి సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత కార్మికుల కడుపు కొట్టే నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని తెలిపారు. సిఎం, డిప్యూటీ సిఎం మున్సిపల్ కార్మికులను అక్కున చేర్చుకోవడం, వారి కాళ్లు కడగడం , సన్మానించడం వల్ల ఎలాంటి ఫలితం కార్మికులకు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ విధానం మీరు రద్దు చేయదలచుకుంటే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పర్మనెంట్ ఉద్యోగులతో పాటు 62 సంవత్సరాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర బెనిఫిట్స్ రిటైర్మెంట్ సమయాన అందజేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఆ తర్వాతే ఈ ఆప్కాస్ విధానం రద్దు చేయాలని చెప్పారు. గుట్టు చప్పుడు కాకుండా సందట్లో సడే మియా అని వారి వారి పార్టీ ప్రతినిధులకు కాంట్రాక్టు విధానాన్ని అప్పజెప్పడం ఎంతవరకు న్యాయమో అన్ని రాజకీయ పార్టీలు నిలదీయాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇల్లు ముట్టడి చేసేందుకు సిద్ధమేని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, సుంకర కిరణ్, ఆనంద్, శ్రీధర్ బాబు, రమా, ఉష, శివ, వెంకటేష్, శివ, హరి, కుమార్ సభ్యులు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఆప్కాస్ వ్యవస్థను రద్దుచేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రయివేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు వెంటనే విడనాడి పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఎన్ఎం ఆర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షుడు జి. ఏసుదాస్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూని యన్ పట్టణ కార్యదర్శి శేఖర్ తెలిపారు. మంగళవారం సిఐటి యు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. ప్రస్తుతం అప్కాస్ ను రద్దుచేసి ప్రయివేట్ ఏజెన్సీలకు ఇవ్వాలనే ప్రయత్నాన్ని సరైందని కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు ఏ. వినయ్ కుమార్, అబ్రహం, నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు (సిఐటియుఅనుబంధం) బి.నాగన్న, శివ, చంటి, పుల్లయ్య, నటరాజు, సుధీర్, సుబ్బారాయుడు, ఎస్సయ్య, రాజేష్, పుల్లమ్మ, ప్రభావతి, వెంకట లక్ష్మీ, జయలక్ష్మి , లక్ష్మి, తిరుపలమ్మ , సుశీల కార్మికులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్నకార్మికులు

అన్ని మండలాలను
కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో గత ఖరీఫ్, రబీ సీజన్లో అతివృష్టి, అనావృష్టితో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. గత మార్చి 28న కేంద్ర ప్రభుత్వ కరువు బృందం కడప జిల్లాలో పర్యటించారని తెలిపారు. జిల్లాలోని రైతు సంఘాలతో కానీ, వివిధ పార్టీల ప్రతినిధులతో కానీ మాట్లాడకుండా, అన్ని మండలాలు పర్యటిం చకుండా, రైతాంగంతో మాట్లాడకుండా, జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన అర కొరల సమా చారంతో 10 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రటికం చిందని పేర్కొన్నారు. ప్రకటించిన కరువు మండలాలలో కడప జిల్లా పశ్చిమ మండలాలు ఏ ఒక్కటీ లేవన్నారు ముఖ్యంగా కమలాపురం, పులివెందుల, జమ్మల మడుగు నియోజకవర్గాలలో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన మినుము, పెసర, వేరుశనగ, మిర్చి, పసుపు, బుడ్డ సెనగ, ఉద్యానవన పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులు చేసుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. వర్షాధార పంటల మీద రైతులు భారీగా ఆధా రపడ్డారని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలకు కనీసం పెట్టుబడియైన దిగుబడి రాక, భూములను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా పాలకులకు కనికరం లేకపోవడం బాధా కరమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాలలో తీవ్ర లోటు వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు విలయతాండవం చేస్తుందని పేర్కొన్నారు. పూర్తి కరువుతో అలమటించిపోతున్న కమలాపురం తాలూకాలోని ఏ ఒక్క మండలాన్ని కరువు మండలాలుగా ప్రకటించలేదన్నారు. పశ్చిమ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం గమనిస్తే అధికారులకు సైతం చిన్న చూపు ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. పశ్చిమ ప్రాంతంలో 70 శాతం పైగా రైతాంగం వర్షాధార వ్యవసాయం మీద ఆధారపడి జీవి స్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారందరికీ కరువు ప్రాం తంగా ప్రకటించి ఉంటే కొంతవరకైనా ప్రభుత్వం నుంచి సహాయం అందేదన్నారు. జిల్లాలోని 36 మండలాలలో తాగునీటి సమస్య, లోటు వర్షపాతం, భూగర్భ జలాలు ఇంకి పోవడం, పశువులకు గ్రాసం లేక పశువులను కబేలాలకు తరలించడం, పంట దిగుబడి తగ్గిపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోవటం, లాంటివి కేంద్ర ప్రభుత్వ కరువు అంచనా బృందానికి కనపడలేదా అని వారు ప్రశ్నించారు. కడప జిల్లాలోనే పాల ఉత్పత్తిలో అత్యధిక శాతం పులివెందుల తాలూకాలోని చక్రాయిపేట ఉందని అక్కడ కరువు తాండవిస్తోందని, పశువులకు గ్రాసం లేక కబేలాలకు తరలిస్తున్నారని సాక్షాత్తు జిల్లా పరిషత్ సమావేశాల్లోనే చర్చించారని పేర్కొన్నారు. ఇప్పుడు కరువు మండలాల జాబితాలో చక్రాయపేట ప్రకటించకపోవడం పులివెందుల నియోజకవర్గం కావడమా అని వారు ప్రశ్నించారు.

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట ఏక శిలా నగరంలోని కోదండ రామ ఆలయంలో మంగళ వారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం నిర్వహిం చడం ఆన వాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. **బ్రహోత్సవాల్లో వాహనసేవల వివరాలు..** 6న ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనం, 7న ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంసవాహనం, 8న ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహవాహనం, 9న ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమంత వాహనం, 10న మోహినీ అలంకారం, రాత్రి గరుడ సేన, 11న ఉదయం శివధనుర్భాణ అలకారం, రాత్రి కల్యాణం, గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, 13 ఉదయ్యం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వవాహనం, 14న ఉదయం చక్రవాహనం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 15 సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.

ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలోనే చేయాలి

ప్రజాశక్తి - వల్లూరు : ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలోనే జరిగేలా చూడాలని జిల్లా టిబి, లెప్రసీ అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. నెలవారి సమీక్ష సమావేశంలో భాగంగా మంగళవారం వల్లూరు వైద్యశాలలో డాక్టర్ ఫణింద్ర, సిహెచ్ఒ వేణుగోపాల్‌తో కలిసి ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో గర్భిణులకు ప్రసవాలు స్థానిక వైద్యశాలలో జరిగేలా ప్రచారం నిర్వహించాలన్నారు. 108, 102 సేవల గురించి ప్రజలకు వివరించి, గర్భిణులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సకాలంలో ఐరన్, విటమిన్ ఏ మాత్రలను సరఫరా చేయాలన్నారు. తల్లిపాల విశిష్టతని వివరించాలని తెలిపారు. ఎన్సిడి, కేన్సర్, డెంటల్, పిఎంజెవై సికిల్ సన్ వ్యాధులపై అవగాహన కల్పించి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా, ఆశావర్కర్లు, అంగన్వాడీ కేంద్రాలలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నేడు చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చెన్నూరు : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సభా భవనంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిరణ్‌మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు ఆయా శాఖ అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని కోరారు.

సిబ్బంది సేవలు ప్రశంసనీయం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించి విరమణ పొందడం అభినందనీయమని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికలు అందచేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకూ శాంతిభద్రతల పరిరక్షణకై సేవ చేస్తూ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం కూడా గుర్తుండి పోయేలా మంచి పేరు ప్రఖ్యా తులు తెస్తాయన్నారు. నిబద్ధత, అంకిత భావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. విరమణ పొందిన తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సకాలంలో రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఆర్ఐలు టైటస్, వీరేష్, శివరాముడు, డిపిఒ ఎఒ జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు తేదీ ప్రకటించాలని ఈనెల 2న కలెక్టరేట్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో 6,100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని, మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తేదీలు ప్రకటించలేదని తెలిపారు. ఇంతకు నిర్వహిస్తారో లేరో అని అభ్యర్థులు అయోమయంలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి నియామకాలు చర్యలు చేపడతామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఆ హామీ కూడా ఇంతవరకు అమలు కాలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. అభ్యర్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాకీరుద్దీన్‌కు సన్మానం

ప్రజాశక్తి- కడప అర్బన్ : మక్కా, మదీనా యాత్రకు వెళ్లి వచ్చిన సంఘం బీడీ జాకీరుద్దీన్‌ను టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్సూర్ అక్బర్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాకీరుద్దీన్ పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. రంజాన్ నెలలో ఎక్కువ అన్న దానం చేశారని తెలిపారు. పేదలకు, సమాజానికి యువత సేవా చేయాలని కోరారు. జాకీరుద్దీన్ తండ్రి నసీరుద్దీన్ నిత్యం దాన ధర్మాలు చేస్తూ ఉత్తమమైన వ్యక్తిగా జీవిస్తున్నాడని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో పవిత్ర మైన ఉమ్రా యాత్రకు వెళ్ళివచ్చిన జాకీరుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శిల్పారామం ఉగాది కేలండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప శిల్పారామం వారు రూపొందించిన ఉగాది కేలండర్‌ను ఎమ్మెల్యే మాధవి ఆష్కరించారు. మంగ ళవారం ఎంఎల్ఎ నివాసంలో శిల్పారామం పరి పాలన అధికారి కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ పి.మధుసూదన్ బాబు క్యాలెండర్ ఆవిష్కరణంలో పాల్గొన్నారు. సాయంత్రం శిల్పారామంలో మిస్పా మూవి సహకారంతో పులివెందులకు చెందిన ఎస్.కె. డ్యాన్ అకాడమి, కడప నగరానికి చెందిన అఖిల్ డ్యాన్స్ అకాడమి వారు కళాకారుల చేతి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పశువుల సంరక్షణకు కృషి

ప్రజాశక్తి- చెన్నూరు : గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలను సంరక్షి ంచడంతోపాటు వాటి దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం పనిచేస్తు ందని పీడీ ఆది శేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల ంలోని కొండపేట గ్రామంలో పశువుల నీటి తొట్లు నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 714, మంలానికి 9 నీటి తొట్లు మంజూ రయ్యాయని చెప్పారు. ఒక్కొ తొట్టికి రూ. 33,200 ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వాటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి శారదమ్మ, ఎంపిడిఒ కిరణ్ మోహన్‌రావు, ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, పశువైద్యాధికారి, ఎపిఒ శైలజ, ఎంపిపి సురేష్ యాదవ్, తుంగ చంద్ర యాదవ్, మాజీ మండల ఉపాధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, కడప మార్కెట్ మాజీ చైర్మన్ శివారెడ్డి, టిడిపి నాయకులు చెన్నయ్య, ఎం నరసింహారెడ్డి, మాజీ జడ్‌పిటిసి చిన్నయ్య, నాగభూషణం, కూలీలు రైతులు పాల్గొన్నారు.

నేడు జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం

ప్రజాశక్తి - కడప : బజ్మెజకీ, అమీరున్నిసా విద్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 2న సాయంత్రం 6.30 గంటలకు కడప నగరంలోని రవీంద్ర నగర్ యుఎస్ కళ్యాణ మంటపంలో జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం, ప్రముఖ ఉర్దూ కవి సయీద్ నజర్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నామని కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ విసి ముజఫ్ఫర్ షహమీరీ అబ్దుల్ హఖ్, రిటైర్డ్ ఉర్దూ ఆచార్య ఖాసీం అలిఖాన్ పాల్గొంటారన్నారు.

జమిలి ఎన్నికలు పిచ్చి తుగ్లక్ చర్య : పిసిసి

ప్రజాశక్తి - కడప : రాజ్యాంగ సవరణ చేసి దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని ఎన్నికలు జమిలి ఎన్నికలు నిర్వహించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిది డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికల ద్వారా కలిగే ప్రయోజనాలను దేశ ప్రజలకు చెప్పాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా చెప్పడం గర్హనీయమన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ప్రధానంగా ఐదు రాజ్యాంగ సవరణలు అవసరం అందుకు లోక్ సభ, రాజ్యసభలో మూడింట రెండు వంతులు మెజారిటీ కావాలని పేర్కొన్నారు. జమిలీ ఎన్నికల వల్ల ప్రభుత్వానికి ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి కారణంగా అభివృద్ధి కుంటుపడుతుందని బిజెపి నాయకులు చెప్పడంలో వాస్తవం లేదు అన్నారు.

బిసి భవన్‌ను వినియోగంలోకి తేవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : పోటీ పరీక్షల సంసిద్ధం అయ్యే విద్యార్థులు కోసం బిసి భవన్‌ను మరింత వినియోగంలోకి తీసుకు రావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పాత రిమ్స్, పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాలను, భవనాలను కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా పాత రిమ్స్‌లోని ఖాళీ స్థలాల ప్రాంతాలను సందర్శించారు. అనంతరం పాత రిమ్స్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన బిసి వెల్ఫేర్ భవనాన్ని, మీటింగ్ హాలు,తరగతి గదులు, ఇతర రూములను పరిశీలించారు. బిసి వెల్ఫేర్ భవన్ ఫండ్స్, మెయింటెనెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

విద్యుత్ కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ట్రాన్స్‌కో, డిస్కం, జెన్‌కోల్లో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులకు 2022 పిఆర్‌సి అరియర్స్ ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ఈనెల 7న తిరుపతిలో నిర్వహించబోయే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఆపరేటర్లందరికి 2019 నుండి 2024 వరకు చేరిన ప్రతి ఒక్కరికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందిస్తున్న దాతలు

విభిన్నప్రతిభావంతులకు సరుకులు వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవ సమితి ఆధ్వర్యంలో పల్లె చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం మంగళవారం 20 మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె చంద్రశేఖర్‌రెడ్డి తమ్ముడు పల్లె రఘురామిరెడ్డి కుమారులు మోహిత్‌రెడ్డి, అఖిలేశ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ తమ అన్న పల్లె చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం విభిన్నప్రతిభావంతులను గుర్తించి, గొప్ప మనసుతో ఆలోచించి సరుకులు అందించామన్నారు. ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్న ప్రతిభావంతుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ దివ్యాంగులకు సరుకులు ఇవ్వడం వల్ల వారిపై ఆధారపడిన కుటుంబాలకు చేయూతనందించిన వారవుతారన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జ్యోతి, ఎద్దు సుబ్బరాయుడు, ఆసిఫ్, భద్రుడు, రహమతుల్లా, రమేష్ పాల్గొన్నారు.

డిటితో మాట్లాడుతున్న పలు సంఘాల నాయకులు

ఇంటింటికీ బియ్యం పంపిణీ చేయాలి

- ఎంఆర్‌పిఎస్, ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్య నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పిడిఎస్ రైస్ వ్యానులతోనే ఇంటింటికీ బియ్యం పంపిణీ చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ కడప ఇన్‌ఛార్జి గడ్డం నరసింహులు, ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సాయినాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పిడిఎస్ రైస్ ఇంటింటికి వ్యాన్ ద్వారా పంచేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రొద్దుటూరు పట్టణంలో ఇష్టానుసారంగా స్టోర్ దగ్గరికి వచ్చి తెచ్చుకోండని ప్రజలకు చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే గతంలోలా ఇంటికి వచ్చి బియ్యం పంపిణీ చేయాలని వారు కోరారు.

సింహాద్రిపురాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని వైసిపి రైతు విభాగం రాష్ట్ర నాయకుడు వి.అరవింద నాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో అతివృష్టితో పంట దిగుబడి బాగా తగ్గిపోందన్నారు. బుడ్డ శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలు భారీ స్థాయిలో దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్ఆర్ జిల్లాలోని తొండూరు, అనంతపురం జిల్లాలోని ఎల్లనూరు మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వీటి మధ్యలో ఉన్న సింహాద్రిపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు మండలంగా ప్రకటించి ఖరీఫ్, రబీలో పంటలకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

- సిబ్బందికి కమిషనర్ రాముడు సూచన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను ఎక్కడికక్కడ పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మారుతి హాల్ వీధిలో నీటి సరఫరా సమస్య ఉందని తెలుసుకొని వెంటనే స్పందించారు. అక్కడ ఉన్న మోటరుకు మరమ్మతులు చేయించారు. పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తామన్నారు. వేసవిలో నీటిని వృథా చేయరాదని, పురపాలక సంఘానికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మి భార్గవి, మున్సిపల్ డిఇ చిదానందరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రాముడు

మైనర్లు ట్రిపుల్ రైడింగ్‌తో హల్‌చల్

బైక్‌పై ముగ్గురు, నలుగురితో డ్రైవింగ్ - హడలెత్తిపోతున్న ప్రజలు

నిబంధనలకు వ్యతిరేకంగా బైక్‌పై వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మైనర్లు బైక్‌లో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టణంలో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయం దారిలో బైక్‌లను నిర్లక్ష్యంగా అతివేగంగా నడుపుతూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. మైనర్లు, విద్యార్థులు చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్ వల్ల దారిలో నడిచే పిల్లలు, బాలికలు, మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అతివేగం వల్ల ఇటీవల కూరగాయల మార్కెట్ వద్ద ఒక బాలుడు బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిర్లక్ష్యం డ్రైవింగ్ వల్ల వారి ప్రాణాలే కాకుండా ఇతరులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నా బాటసారులను ఢీకొన్నా పెనుప్రమాదం జరుగుతుందని పలువురు హడలిపోతున్నారు. లైసెన్స్, హెల్మెట్ లేకున్నా ట్రిపుల్ రైడింగ్ చేసినా జరిమానా విధిస్తామని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, ఆచరణలో కనబడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఫలితం శూన్యమని ప్రజలు అంటున్నారు. పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నా విద్యార్థులు, మైనర్లు ఏ మాత్రం పట్టించుకోకుండా దర్జాగా బైక్‌లు నడుపుతూనే ఉన్నారని పలువురు పేర్కొంటున్నారు. మైనర్లు అధికంగా బైక్‌లు నడుపుతున్నారు. ఒక బైక్‌లో ముగ్గురు, నలుగురు తిరుగుతున్నారు. మైనర్లకు బైకులు ఇవ్వొద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్న ఎలాంటి ఫలితం లేదని ప్రజలు అంటున్నారు. విద్యార్థులు, మైనర్లు ట్రిపుల్ రైడింగుపై పోలీసులు ప్రత్యేకదృష్టి సారించి అతి వేగానికి కళ్లెం వేయాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

చిన్నపిల్లలపై అత్యాచారాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చిన్న పిల్లలపై అత్యాచారాలకు పాల్పడితే ఫోక్స్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతి గృహంలో మంగళవారం మధ్యాహ్నం పులివెందుల మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపిల్లలపై రోజురోజుకూ అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నిరోధించేందుకు సుప్రీంకోర్టు 2012 నవంబర్ 12న ఫోక్స్ యాక్ట్ ప్రవేశపెట్టిందన్నారు. ఎవరైనా మీ పట్ల అసభ్య కరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. విద్యార్థినులు ధరించే దుస్తులు కూడా మంచిగా ఉండాలనీ, ఎవరికి భయపడాల్సిన పనిలేదన్నారు. మీకేమన్నా సమస్యలుంటే 1500 నెంబర్‌కు ఫోన్ చేసినా, 100కు ఫోన్ చేసినా తక్షణమే పోలీసులు స్పందించి చర్యలు తీసుకుంటారన్నారు. తల్లిదండ్రులకు విధేయత ఉండాలన్నారు. మంచిగా చదువుకొని బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ వి.కిషోర్ కుమార్ రెడ్డి, పాలగిరి ప్రకాష్, వార్డెన్ కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి

గుంతలు తవ్వి పని పూర్తయినా పట్టని రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో..!

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల రోటరీపురంలో ఉన్న కాలనీలో భూగర్భ అండర్ డ్రయినేజీ కోసం రోడ్లు తవ్వారు. ఆ పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా సిసి రోడ్డు వెయ్యకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళల్లో చాలా అసౌకర్యంగా ఉందని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఉందని, విద్యార్థులు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల డ్రయినేజీ నీరు పోకుండా కాలువలపై వెళుతుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును వెంటనే వేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గోడపత్రాలను అవిష్కరిస్తున్న నజీర్ హుసేన్

జిఒ 110ని అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఫ్యాకల్టీగా పనిచేసే ఉద్యోగులకు కూడా జిఒ 110ని అమలు చేయాలని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో జిఒ 110ని అమలు చేయాలని 7,8 తేదీల్లో రెండు రోజులపాటు చేపట్టుతున్న ధర్నా గోడపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నజీర్ హుసేన్ మాట్లాడుతూ శ్రమ దోపిడీపై నూజివీడు ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, ఆర్జీయూకేటీ యాజమాన్యం జోక్యం చేసుకొని తమ డిమాండ్లను తీర్చాలని ఆయన కోరారు.

ప్రభుత్వ సాయాన్ని వెంటనే రైతులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - చాపాడు

కూటమి ప్రభుత్వం ప్రకటించిన 51 కరువు మండలాల్లో కడప జిల్లా నుండి పది మండలాలు ప్రకటించడం సంతోషకరమని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ తెలిపారు. మంగళవారం మైదుకూరులో సమితి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చొక్కం సంజీవరాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.రామ్మోహన్, చెక్‌పోస్ట్ శ్రీనివాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఏ రైతుకు కూడా ఒక్క రూపాయి కూడా సాయం అందలేదన్నారు. కరువు మండలాలు ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి రైతుకు బ్యాంకులో రుణ సహాయం, అలాగే అన్ని రకాల విత్తన, ఎరువుల సహాయం అందజేయాలని ఎవి రమణ ప్రభుత్వాన్ని కోరారు.

నీటి తొట్టి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపిడిఒ

'ఉపాధి'లో నీటి తొట్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

వేసవిలో పశువులకు తీగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. మైదుకూరు మండలం అన్నలూరు గ్రామపంచాయతీలో పశువులకు తాగేందుకు ఉపయోగపడే నీటి తొట్టి నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పశువులకు ఉపయోగపడే నీటి తొట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఉపాధి హామీ నిధులతో నీటి తొట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, ఉపాధి ఎపిఒ రామచంద్రారెడ్డి, టిడిపి నాయకులు నాగమోహన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, చంద్ర ఓబుల్‌రెడ్డి, ఓబులేసు, రాజారెడ్డి, టిఎ రమణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు పట్టణం కడప ప్రధాన రోడ్డుపెన పెద్ద మసీదుకు ఎదురుగా తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఆ మేరకు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ విద్యుత్ అధికారులను కోరుతున్నారు. రైతు సేవాసమితి మైదుకూరు పట్టణ అధ్యక్షుడు కె.రామ్మోహన్ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇటీవల పరిశీలించారు. ప్రజలు ప్రమాదానికి గురికాకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించాలని వారితోపాటు పలువురు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందని, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న స్థానికులు

చురుగ్గా బస్సు షెల్టర్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని అంబేద్కర్ కూడలి వద్ద కడపకు వెళ్లే మార్గంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మించి కొందరు యథేచ్ఛగా వినియోగించుకునేవారు. మరికొందరు అక్రమ కట్టడాలు నిర్మించి గదులను అద్దెకిస్తూ లబ్ధి పొందుతుండేవారు. ఈ విషయమై స్థానిక నాయకులు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను అడ్డుకొని, అక్కడ ప్రయాణికులకు ఉపయోగపడేలా బస్సు షెల్టర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. స్థానిక రహమత్‌ఖాన్ పల్లెకు చెందిన టిడిపి నాయకులు ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్ బస్సు షెల్టర్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. బస్సు షెల్టర్ లేక ఎండ, వానకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుండేదని, బస్సు షెల్టర్ నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ కూడలి వద్ద దాదాపు చుట్టుపక్కల ప్రాంతాల 10 గ్రామాల వరకు ఈ ప్రాంతంలో బస్సు ఎక్కేందుకు వస్తుంటారు. చాలా ఏళ్ల తర్వాత బస్సు షెల్టర్ ఏర్పాటుకు నాయకులు చొరవ తీసుకోవడం సంతోషంగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

I.P.No. 10/2025

వై. రామాంజనేయరెడ్డి, S/o సంజీవరెడ్డి, హిందూ, 36 సం॥లు, వ్యవసాయం, డోర్‌నెం.1/45, పెద్ద దండ్లూరు గ్రామం, జమ్మలమడుగు మండలం. **...పిటిషనర్**

Vs

ఇరగంరెడ్డి మునికుమార్‌రెడ్డి, S/o నాగమునిరెడ్డి, హిందూ, 34 సం॥లు, పెద్ద దండ్లూరు గ్రామం, జమ్మలమడుగు మండలం, మరియు ఇతరులు.

...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారుడు అయిన పై పిటిషనర్ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు రెస్పాండెంట్స్ పైన I.P. షెడ్యూలు దాఖల ఆస్తిని annuling చేయకోరుచూ దాఖలు చేసి వున్నాడు. అట్టి పిటిషన్ పై ఎవరికీ గాని ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల 2.5.2025వ తేదీన ఉ.10.30 గంటలకు పై కోర్టు యందు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను అని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 2.5.2025

//By Order of the Court//

ఎన్.వి.వరప్రసాద్

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే 'పుట్టా' కృషి అభినందనీయం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషి అభినందనీయమని టిడిపి నాయకులు కొనియాడారు. మైదుకూరు టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మైదుకూరు, చాపాడు, బి.మఠం, ఖాజీపేట, దువ్వూరు మండలాలను కరువుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నియోజకవర్గ రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని ప్రశంసించారు. 40ఏళ్ల చరిత్రలో ఎప్పుడు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన చరిత్ర లేదన్నారు. కరువు మండలాల వల్ల రుణాలు రీ షెడ్యూల్, పంట నష్ట పరిహారం, విత్తన పంపిణీ తదితర అనేక లాభాలు రైతులకు కలుగుతాయన్నారు. మైదుకూరు మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా, సుందరీకరణ నిధుల మంజూరు, కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ధనపాల జగన్, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, బి మఠం, దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల అధ్యక్షులు సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమయ్య, లక్ష్మిరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవమైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా శివప్రసాద్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు బార్ అసోసియేషన్ 2025-2026కి సంబంధించి మంగళవారం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కోర్టు కంప్లెక్స్‌లో ఉన్న అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ కార్యాలయం అడ్వకేట్స్ సర్వసమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సోమేసుల శివప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా ఆకుల వెంకట శివరాం, సహాయ కార్యదర్శులుగా చిలుంగారి కృష్ణమూర్తి, మహిళా కార్యదర్శులుగా షేక్ తహసీన్ భాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామిశెట్టి శ్రీనివాసులు, జ్వాలా నరసింహశర్మ, కామానూరు శ్రీనివాసులు, పి.వి.నారాయణరెడ్డి, మూలే నాగిరెడ్డి, కోనేటి శ్రీనివాస్, జె.కె.చారి, జె.రవిశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

బ్రాహ్మణ భవనాలకు స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బ్రాహ్మణులు అపర కర్మలు నిర్వహించు కోవడానికి బ్రాహ్మణ భవనాలు లేవని, వాటి నిర్మాణానికి స్థలాలు ప్రభుత్వం కేటాయించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు సూగురు రఘునాథ్‌రావు, రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ పి.వి.ఎస్.వి ప్రసాదరావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు 90శాతం మంది కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారని అన్నారు. గత అయిదేళ్లుగా కార్పొరేషన్‌లేక, పథకాలు అందక నష్టపోయారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బిసి కార్పొరేషన్ నుండి బ్రాహ్మణ కార్పొరేషన్ వేరు చేయాలని కోరారు. పార్టీ పట్ల అంకితభావం గల వ్యక్తులును చైర్మెన్‌గా నియమిస్తే బ్రాహ్మణులుకు మేలు కలిగే పథకాలు అమలు చేస్తారని అన్నారు. బ్రాహ్మణులు ఇళ్లల్లో జరిగే అపర కర్మల నిర్వహణ కోసం ఇతర ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తద్వారా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సభలు, ఊరేగింపులకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు, ధర్నాలు వంటివి నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పక తీసుకోవాలని డిఎస్‌పి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 30వ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. దీన్ని అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సెక్షన్ 30 అమలు చేశామని డిఎస్‌పి తెలిపారు.

రైల్వే అధికారులకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు రైల్వేస్టేషన్ కనీస సదుపాయాల నిమిత్తం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చేసిన వినతికి స్పందించిన రైల్వే అధికారులకు కేంద్రం భవన నిర్మాణ కార్మిక సలహా మండలి చైర్మన్ వి.శ్రీనివాస నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జమ్మలమడుగు రైల్వే ప్లాట్‌ఫాం బాగా పాడైం దని, జమ్మలమడుగు నుంచి బెంగళూరుకు రోజుకు దాదాపుగా వేల మంది ప్రయాణికులు బస్సుల్లో పోతున్నారని, జమ్మలమడుగు రైల్వేలైన్‌లో కూడా బెంగళూరుకు రైలు నడపాలని, ప్రయాణికుల రక్షణ కోసం ఆర్‌పిఎఫ్ ఉద్యోగులను ఏర్పాటు చేయాలనే వంటి వసతులను కోరామన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు

A.S.No. 43/2016

కె.ఎస్.మహ్మద్ బసీర్, S/o పకీర్‌సాహెబ్, ముస్లిం, 40 సం॥లు, డోర్.నెం.16/405, నడింపల్లి వీధి, ప్రొద్దుటూరు.

...అప్పిలెంట్

Vs

10. కడప జిలాని దౌలా, S/o మహమ్మద్ దౌలా, 46 సం॥, డోర్.నెం.8/127, అల్మాస్‌పేట, కడప.
11. కడప ఫైరోజ్ దౌలా, S/o మహమ్మద్ దౌలా, 44 సం॥, డోర్‌నెం.8/127, అల్మాస్‌పేట, కడప.
12. కడప ముస్తఫ దౌలా, S/o మహమ్మద్ దౌలా,40 సం॥, డోర్.నెం.8/127, అల్మాస్‌పేట, కడప.
13. కడప జహిదా నాసిన్, S/o మహమ్మద్ దౌలా, 52 సం॥, డోర్.నెం.8/127, అల్మాస్‌పేట, కడప.
14. కడప మల్లిక, D/o మహ్మద్ దౌలా, 45 సం॥, డోర్‌నెం.8/127, అల్మాస్‌పేట, కడప.
15. కడప రేష్మ, D/o మహమ్మద్ దౌలా, 38 సం॥, డోర్‌నెం.8/127, అల్మాస్‌పేట, కడప.

...రెస్పాండెంట్ R10 to R15

నోటీసు

పై నెంబరు అప్పీలును ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు O.S.No.257/2011 నందు పాలించిన తీర్పును రద్దు చేయకోరి దాఖలు చేసి వున్నారు. అట్టి అప్పీలు నందు R10 to R15 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 15.4.2025వ తేదీన ఉ॥10.30 గం॥లకు స్వయంగా కానీ లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది:15.4.2025

//By Order of the Court//

ఎన్.వి.వరప్రసాద్

అడ్వకేట్, ప్రొద్దుటూరు.